

రైతు పట్టాల మంజూరుపై విచారణ

ప్రజాశక్తి - భీమవరం

మొగల్తూరు మండలం కాళీపట్నం జమీందారి భూములు రద్దు చట్టం అనుసరించి కాళీపట్నం భూముల యజమానులకు రైతు వారి పట్టాలు మంజూరుకు 20 మంది రైతులకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్, సెటిల్మెంట్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి విచారణ చేపట్టడం జరిగింది. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా జాయింట్ కలెక్టర్ చాంబర్లో ఈ విచారణ సమావేశంలో సంబంధిత అధికారులు, భూ యజమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సంబంధిత భూ యజమానులు వారి వద్ద ఉన్న హక్కు పత్రాలు దాఖలు చేయాలని, వారికి సంక్రమించిన హక్కు పత్రం రుజువు, ఎంజాయ్మెంట్ దరిమెల రైతు వారి పట్టాల మంజూరుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జెసి అన్నారు. ఈ విచారణ సమావేశంలో కలెక్టరేట్ ల్యాండ్ సూపరిటెండెంట్ సిహెచ్.రవికుమార్, మొగల్తూరు తహశీల్దార్ రాజకిషోర్, రైతులు పాల్గొన్నారు.

కోళ్లపై వైరస్ పంజా..!

తొలుత నాటుకోళ్లు, ఆపై బాయిలర్, తాజాగా లేయర్ కోళ్లపై ప్రభావం

వందల సంఖ్యలో కోళ్ల మృతి

తల్లడిల్లుతున్న రైతులు



కోళ్ల పారంలో కోళ్లు



వైరస్‌తో చనిపోయిన కోళ్లు

ప్రజాశక్తి - తణుకు రూరల్

పౌల్ట్రీ పరిశ్రమ రైతులు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా అంతుచిక్కని వైరస్ ప్రభావంతో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం తణుకు పరిధిలోని ఓ కోళ్ల ఫారంలో ఒకే రోజు వంద కోళ్లు మృత్యువాత పడడం దీనికి నిదర్శనం. ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 370 కోళ్ల ఫారాలు ఉన్నట్లు సమాచారం. ఈ రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 2.50 కోట్ల వరకూ లేయర్ కోళ్లు ఉండగా గత కొద్దిరోజులుగా రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడడం గమనార్హం. తొలుత ఈ వైరస్ నాటు కోళ్లకు పాకింది. దీంతో నాటు కోళ్లు సైతం మృత్యువాత పడ్డాయి. ఈ ప్రభావం సంక్రాంతి కోడిపందేల్లో కూడా కనిపించింది. నాటు కోళ్లు లేక చాలా వరకూ బరులు ఖాళీగా దర్శనమిచ్చాయి. ప్రస్తుతం ఈ వైరస్ లేయర్ కోళ్లకు సైతం విస్తరించింది. సాధారణంగా గుడ్ల కోసం పెంచే లేయర్ కోళ్ల విషయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ ఉంటారు. కోడి గుడ్డు పెట్టే సమయం వరకూ దానికి రూ.300 ఖర్చు అవుతుంది. 18వ వారం నుంచి గుడ్డు పెట్టడం మొదలు పెట్టి 100 వారాల వరకూ గుడ్లు ఉత్పత్తి చేస్తుంది. గుడ్డు ఉత్పత్తి కోసం రైతుకు గుడ్డు నిమిత్తం రూ.4.60 పైసలు ఖర్చవుతుంది. గుడ్ల ఉత్పత్తిలో ఏపీలో ఉభయగోదావరి జిల్లాలు ప్రథమ స్థానంలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్, ఒరిస్సా వంటి రాష్ట్రాలం ఇక్కడ నుంచి గుడ్లు ఎగుమతి చేసుకుంటున్నాయి. ప్రస్తుతం వైరస్ ప్రభావంతో రైతులు కోళ్లకు సంబంధించిన మందులు, మేతల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేస్తున్నారు. అదేవిధంగా కోళ్లు వైరస్ బారిన పడకుండా ముందస్తుగా తరచూ వ్యాక్సిన్లు వేస్తుంటారు. గుడ్డు దిగుబడి పెంచేందుకు కోళ్లకు తగిన ఆహారాన్ని సరఫరా చేస్తుంటారు. అయితే ఉన్నట్టుండి ప్రస్తుతం కోళ్లు మృత్యువాత పడడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటి వరకూ సుమారుగా రెండు లక్షల వరకూ కోళ్లు అంతు చక్కని వ్యాధి బారినపడి మృత్యువాత పడినట్టు సమాచారం. ఈ వైరస్ బారిన పడిన కోళు ఐదు నుంచి 6 గంటల్లోనే మృత్యువాత పడుతున్నాయి. శరీర ఉష్ణోగ్రత బాగా పెరగడం, నోటి నుంచి సొంగ కార్చుకుంటూ చనిపోతున్నాయి. కోడి వయసుతో సంబంధం లేకుండా మృత్యువాత పడుతుండటం రైతులను మరింత కలవరపాటుకు గురిచేస్తోంది.

పాటించాల్సిన జాగ్రత్తలు..

కోళ్ల పరిశ్రమ రైతులు నిర్ణీత వయసులో కోళ్లకు వ్యాక్సిన్లు వేయించుకోవాలి. ప్రస్తుతం వివిఎన్‌డి వైరస్ ప్రభావం ఎక్కువగా ఉందని, ఇది ఆర్‌డి వైరస్‌లో ఒక స్ట్రైన్ అని పశు సంవర్ధక వైద్యులు సూచిస్తున్నారు. వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా అదేవిధంగా కోళ్లలో రోగ నిరోధక శక్తి పెరిగేందుకు తగిన ఆహారం ఇవ్వాలని చెబుతున్నారు. కోళ్ల ఫామ్ లోకి వచ్చే వాహనాలు, సిబ్బంది పరిశుభ్రత పాటించడం ద్వారా కోళ్లలో వైరస్ వ్యాప్తిని నివారించడం సాధ్యమవుతుందని చెబుతున్నారు. చనిపోయిన కోళ్లను ఖననం చేసే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు. ఈ వైరస్ సోకిన కోళ్లకు యాంటీబయాటిక్స్ మందులు వాడడంతోపాటు బయోభూస్టర్ స్ప్రే చేయడం ద్వారా నష్టం తగ్గించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

ఆడ పిల్లలకు రక్షణగా నిలవాలి

కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ అంజిబాబు



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం

ఆడపిల్లలకు ప్రతి ఒక్కరూ రక్షణగా నిలవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) కోరారు. భీమవరంలో బేటి బచావో బేటి పడావో (ఆడపిల్లలను రక్షించండి - ఆడపిల్లలకు చదువు చెప్పండి) కార్యక్రమాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మహాత్మ గాంధీ విగ్రహం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకూ నిర్వహించిన అవగాహనా బైక్ ర్యాలీని ఎంఎల్ఎ అంజిబాబు జెండా ఊపి ప్రారంభించారు. తొలుత గాంధీ విగ్రహానికి కలెక్టర్ నాగరాణి, ఎంఎల్ఎ అంజిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుమారు 200 బైక్‌లతో ప్రత్యేకంగా మహిళలు, విద్యార్థినులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ ప్రారంభమైన బైక్ ర్యాలీ జువ్వలపాలెం రోడ్డులోని అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వరకూ సాగింది. అల్లూరి సీతారామరాజు విగ్రహం ముందు ఏర్పాటుచేసిన సైన్ బోర్డుపై మహిళలకు రక్షణ, విద్యకు మద్దతు ప్రకటిస్తూ ప్రతి ఒక్కరూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఆడపిల్లలకు సమాజంలో అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కల్పిస్తూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారు చదువుకుని సుశిక్షితులు అవ్వాలని ఆమె కోరారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించి ఆడపిల్లలను మొగ్గలోనే తుంచేసేలా భ్రూణ హత్యలకు పాల్పడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఒక తల్లిగా, అక్కగా, చెల్లిగా, కోడలిగా ఇన్ని పాత్రలు పోషిస్తున్న మహిళ మీ తల్లిదండ్రులు, మీ అత్తమామలు ఇలానే ఆలోచన చేస్తే ఈ రోజు మీరు ఈ లోకంలో ఎలా ఉండగలిగే వారో ప్రతి ఒక్కరూ ప్రశ్నించుకోవాలన్నారు. ఆడ పిల్లలు సురక్షితమైన వాతావరణంలో ప్రశాంతంగా జీవించడానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈనెల 22 నుండి మార్చి 8వ తేదీ వరకూ వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎంఎల్ఎ అంజిబాబు మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాల్లో ముందుండేలా ప్రోత్సహించాలన్నారు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టగానే మూడో ఆడపిల్ల పుడుతుందనేసరికి అబార్షన్లు చేయించడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు విద్యలో సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సుజాతా రాణి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, వైద్యశాఖ డిపిఎంఒ ధనలక్ష్మి, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, మాజీ ఎంపిసి ఛైర్మన్లు కె.నాగేశ్వరరావు, సంఘం సేవకులు పాల్గొన్నారు.

నిధులు దుర్వినియోగం చేస్తే ఉపేక్షించం

చినఅమిరం గ్రామ పంచాయతీ పూర్వపు కార్యదర్శి కృష్ణంరాజుపై చర్యలు

కలెక్టర్ చదలవాడ నాగరాణి



ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్పష్టం చేశారు. ఇటీవల భీమవరం మండలం చినఅమిరం గ్రామ పంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి ఎస్‌కెజి.కృష్ణంరాజు చినఅమిరం గ్రామ పంచాయతీ వద్ద పనిచేసిన కాలంలో నిధులు దుర్వినియోగం చేశారని బుద్దరాజు వెంకట రామకృష్ణ, సత్యసూర్య సుబ్బరాజులు ఆరోపణ చేస్తూ పిజిఆర్ఎస్‌లో అందజేసిన ఫిర్యాదును పురస్కరించుకొని జిల్లా పంచాయతీ అధికారి అరుణశ్రీ పర్యవేక్షణలో నరసాపురం డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణ కమిటీ అధికారిగా నియమించినట్లు తెలిపారు. వీరికి సహాయంగా నరసాపురం డిఎల్‌పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి, ఏడుగురు పంచాయతీ కార్యదర్శులు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లతో కూడిన టీంను ఏర్పాటు చేసి విచారించడం జరిగిందన్నారు. విచారణ బృందం సభ్యులు చినఅమిరం గ్రామ పంచాయతీ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి 2019 నుండి సెప్టెంబర్ 2024 వరకూ చినఅమిరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎస్‌కెజి.కృష్ణంరాజు చినఅమిరం గ్రామ పంచాయతీ జమల ఖాతాలో రూ.2,73,96,264 నిధులను దుర్వినియోగం చేసినట్లు నరసాపురం డివిజనల్ పంచాయతీ అధికారి నివేదిక సమర్పించడం జరిగిందని తెలిపారు. ఆ నివేదికను అనుసరించి చినఅమిరం గ్రామ పంచాయతీ పూర్వ పంచాయతీ కార్యదర్శి కృష్ణంరాజుపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమిస్తూ అరెస్టుకు ఇప్పటికే ఆదేశించడం జరిగిందని, తరువాత క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర పిఆర్ఆర్‌డి శాఖ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పించి, అరెస్టు కూడా సిఫార్సు చేశామని తెలిపారు. ఈ కేసు విషయమై నిరంతర పర్యవేక్షణ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

దశల వారీగా పనులు పూర్తి చేస్తాం

జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు



యలమంచిలిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - యలమంచిలి

పాలకొల్లు నియోజకవర్గంలో ఆరు నెలల కాలంలో 60 గ్రామాలకు రూ.100 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, రానున్న కాలంలో దశల వారీగా అన్ని పనులూ పూర్తి చేస్తామని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం యలమంచిలి మండలం ఊటాడ, యలమంచిలి, అడవిపాలెం గ్రామాల్లో కోటి రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఆయన స్వయంగా మోటార్ సైకిల్ నడుపుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ, యోగ క్షేమాలను అడిగి తెలుసుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఏటుగట్టు పటిష్టతకు శాశ్వత చర్యలు తీసుకుని ఈ ప్రాంత ప్రజలను ముంపు నుంచి కాపాడతామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. గత ప్రభుత్వంలో పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులతో పాటు పంచాయతీల సొమ్ము కూడా దారి మళ్లించి, పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులను కాజేసి సర్పంచులను భిక్ష మెత్తుకునేలా చేస్తే, నేటి కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులిచ్చి, గ్రామ పాలక వర్గాన్ని గౌరవంగా తలెత్తుకునేలా చేసిందన్నారు. గత ప్రభుత్వ అధినేత జగన్ వేల కోట్ల ప్రజాధనంతో విలాస వంతమైన ప్యాలెస్‌లు నిర్మించుకుంటే, నేడు చంద్రబాబు రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడం ద్వారా పరిశ్రమలు, పారిశ్రామిక వేత్తలను రప్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. గత పాలనలో నివాసయోగ్యం కాని శ్మశానాలు, చెరువులు, ముంపు ప్రాంతాలు, పల్లపు భూములు వంటివి పేదలకు ఇళ్ల స్థలాలుగా ఇచ్చి కమిషన్లు తీసుకుని నిరుపేదలను మోసం చేశారని అన్నారు. ల్యాండు టైటిలింగ్ యాక్టు రద్దు చేసి ప్రజలు ఆస్తికి భద్రత కల్పించామని, 200 అన్నా క్యాంటీన్లు ప్రారంభించి నిరుపేదలకు కేవలం 15 రూపాయలకే మూడు పూటలూ భోజనం పెడుతున్నామన్నారు. మరో 80 అన్నా క్యాంటీన్లు త్వరలో ప్రారంభిస్తామని, నిరుపేదలు ఆకలితో అలమట్టించకూడదనే ప్రభుత్వ ఆశయమన్నారు. గత ప్రభుత్వం ఒక్క డిఎస్‌సి గాని ఒక ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేక పోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తోడుగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నారని వీరికి తోడుగా ప్రధానమంత్రి మోడీ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గ్రంధి నాగవెంకట పవన్ కుమార్, డిఇలు కలవకొలను దుర్గారామ స్వామి, పి.శ్రీనివాసరావు, రామాయణం త్రిమూర్తులు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్‌టి మహిళలను ఎస్‌హెచ్‌జి గ్రూపుల్లో చేర్పించాలి

రుణాల మంజూరులో సీసీలు, ఆర్‌పిలు అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

మహిళల వలసల నిరోధానికి చర్యలు చేపట్టి, ఉపాధిని పెంపొందించాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి ఎస్‌టి మహిళను ఎస్‌హెచ్‌జి గ్రూపులో సభ్యులుగా చేర్పించి, వలసల నిరోధానికి మెరుగైన జీవనోపాధి అవకాశాలను కల్పించడానికి డిఆర్‌డిఎ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ నాగరాణి మహిళల ఫైనాన్షియల్ మేనేజ్మెంట్, జీవనోపాధి అవకాశాలు, ఆడపిల్లల చదువులు, డ్రోన్ల వినియోగం, ఎస్‌హెచ్‌జి రుణాలు, ఆకర్షణీయమైన లేసు అల్లికలు వంటి అంశాలపై డిఆర్‌డిఎ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, నాగరాణి మాట్లాడుతూ కొంతమంది సీసీలు, ఆర్‌పిలు ఎస్‌హెచ్‌జి సంఘాలకు రుణాలు మంజూరు చేసి, నగదు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నా దృష్టికి వచ్చాయని, ఇటువంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. మహిళలు ఇతర దేశాలకు వలసల నిరోధానికి డిఆర్‌డిఎ సిబ్బంది కృషి చేయాలని, మెరుగైన జీవనోపాధికి స్థిరమైన చర్యలు చేపట్టాలన్నారు. లేసు అల్లికలు ఆకర్షణీయంగా ఉంటేనే మార్కెటింగ్ ఉంటుందని, స్థానిక మార్కెటింగ్‌ని కూడా పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లేసు ఉత్పత్తుల పునర్జీవానికి వేగవంతమైన చర్యలను చేపట్టాలన్నారు. సంస్థాగత నిర్మాణం కోసం చిన్న సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమైక్య, జిల్లా సమైక్యలలో అవసరం మేరకు ఖర్చు అనే అంశాన్ని ఎజెండాగా చేర్చి ఏ సందర్భంలో ఎంతవరకు ఖర్చు చేయాలి, ఎలా పొదుపు చేయాలి అనే అంశాలపై మహిళలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్లాస్టిక్ నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు ప్రారంభించడం జరిగిందని, దీనిలో భాగంగా అవసరమైన క్లాత్ బ్యాగ్‌లను తయారుచేసి మార్కెట్లో కొనుగోలుకు అందుబాటులో ఉంచాలన్నారు. ముగ్గురు, నలుగురు సభ్యులు కలిపి డ్రోన్ కొనుగోలు చేసి వ్యవసాయ కార్యక్రమాల్లో వినియోగించి, లాభాలు పొందేలా ప్రోత్సహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని ఆడపిల్లలు 6, 7 తరగతులకే డ్రాప్ అవుట్స్ అవ్వడం గమనించడం జరిగిందని, చదువు ఎందుకు అవసరమో ప్రతి సమావేశంలో చెప్పాలన్నారు. జిల్లాలో మంచానికి, వీల్ చైర్‌కి పరిమితమై రూ.15 వేలు పెన్షన్ అందుతున్న లబ్ధిదారులు 1,510 మంది ఉండగా, ఇప్పటి వరకు 819 పెన్షన్లను రీవెరిఫికేషన్ చేయడం జరిగిందన్నారు. ఫిబ్రవరి మొదటి నాటికి వెరిఫికేషన్ నూరు శాతం పూర్తవుతుందన్నారు. 27,590 మంది వికలాంగుల పెన్షన్లు రూ.6 వేలు పొందుతున్నారని, వీరికి ఈనెల 20 నుంచి జూలై 22 వరకు వారానికి మూడు రోజులు చొప్పున సోమ, మంగళ, బుధవారాల్లో వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి మహిళకు ఉన్నతి పథకం కింద రూ.7.75 కోట్ల రుణాలు మంజూరు లక్ష్యంగా ఇప్పటి వరకు రూ.7.02 కోట్ల 200 మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎమ్ఎస్ఎస్.వేణుగోపాల్, డిపిఎంలు, మండల ఎపిఎంస్, సీసీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

ఎల్ఐసి ఉద్యోగుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అఖిల భారత జీవిత బీమా ఉద్యోగుల సంఘానికి గుర్తింపు ఇవ్వాలని కోరుతూ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం స్థానిక ఎల్ఐసి కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జీవిత బీమా ఉద్యోగుల సంఘం ఉద్యోగుల సంఘం కార్యదర్శి సొలస సత్యనారాయణ మాట్లాడుతూ తమ అసోసియేషన్‌కు గుర్తింపు, క్లాస్ 3, 4 తరగతుల ఉద్యోగుల నియామకాన్ని వెంటనే చేపట్టాలని కోరుతూ ఉద్యోగులు బుధవారం నుంచి ఆందోళన కార్యక్రమాలు ప్రారంభించినట్టు తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గరికిపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ యూనియన్ గుర్తింపు ఆవశ్యకత గురించి సభ్యులకు వివరించారు.

రీసర్వే నూరుశాతం పూర్తి చేయాలి : జెసి



రైతులతో మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - ఇరగవరం

ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టి నిర్వహిస్తున్న రీ సర్వే నూరు శాతం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. బుధవారం ఇరగవరం మండలం పోడలాడ గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడి అధికారులు ముందుగా మీకు నోటీసులు ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు తెలిపారు. సంబంధిత అధికారులు సంబంధిత భూ యజమానులకు ముందుగా నోటీసులు అందజేసి, వారి సమక్షంలో వారి సలహా ప్రకారమే రీ సర్వే చేయాలని ఆదేశించారు. భూ విషయంలో దీర్ఘకాలిక ఉన్న భూ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రీ సర్వేను వేగవంతం చేయాలని జెసి ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో పంట బోదె పరిశీలన

మండలంలోని యర్రాయి చెరువు గ్రామంలో సర్వే నెంబరు 142 పంట బోదె 350 రైతుల సంబంధించిన వ్యవసాయ భూములకు నీరు అందక దీర్ఘకాలిక సమస్యగా ఉందని పిజిఆర్ఎస్‌లో రైతులు జెసి దృష్టికి తీసుకురాగా సమస్యను పరిష్కరించాలని మండల స్థాయి అధికారులను జెసి ఆదేశించారు. రైతులు స్థానికంగా నివాసం ఉంటున్న వారితో చర్చించి పరిష్కరించాలని, పంట బోదే పరిష్కారానికి చర్యలు చేపట్టి, జెసిబి ద్వారా పంట బోదెను తవ్వి, దీర్ఘకాలికంగా ఉన్న సమస్యను పరిష్కరించటంతో జెసి తీరుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఇరగవరం గ్రామంలో సర్వే నెంబరు 406 గ్రామ కంట భూమిలో 70 సెంట్లు వక్స బోర్డు వారికి ఉందని, భూమిని నిషేధిత జాబితాలో వక్స బోర్డు ఆదేశాల మేరకు గ్రామకంఠం భూమి క్రిమ్ విక్రయాలు నిలుపుదల చేయాలని రెవెన్యూ సదస్సులో కోరగా జెసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వక్స్ బోర్డ్ భూమిని సబ్ డివిజన్ చేసి నివేదికను అందజేయాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. దీర్ఘకాలికంగా ఉన్న వక్స్ బోర్డ్ సమస్యను అధికారులతో చర్చించి పరిష్కారం చేసినందుకు జెసికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఖరీఫ్ సాగులో రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా సకాలంలో గోనె సంచులు అందించి ఆర్ఎస్‌కెల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, మిల్లులకు తరలించడం, రైతుల ఖాతాల్లో 48 గంటల లోపు డబ్బులు పడేటట్లు చేసి రైతులకు అన్ని విధాలుగా ఆదుకోవటం జరిగిందని జెసికి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రబి సీజన్లో కూడా రైతులకు అన్ని విధాల సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్‌డిఒ ఖతీబ్ కౌశల్ భానో, తహశీల్దార్ ఎం.సుందరరాజు, మండల సర్వే అధికారులు, విఆర్ఒలు, విఆర్ఎలు, రైతులు పాల్గొన్నారు.

ఏ ఆపద వచ్చినా ఫోన్ చేయండి

ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి



రోగితో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రోగులకు ఏ సమయంలో అయినా ఆపద వస్తే స్వయంగా తనకు ఫోన్ చేయవచ్చని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సమస్యలను, ఆసుపత్రిలో సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ముందుగా మెడికల్ రూమ్ పరిశీలించి అక్కడ గడువు దాటిన మందులు ఉన్నాయా లేదో, టెస్టింగ్ ల్యాబ్‌లో అన్ని మిషన్లు సరిగా పనిచేస్తున్నాయా లేనిది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేషెంట్లు తమ సమస్యలు చెప్పుకునేందుకు స్వయంగా తన ఫోన్ నెంబర్ ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేస్తానన్నారు. ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్ల తాకిడి ఎక్కువగా ఉన్నందున రూ.రెండు కోట్లతో ప్రత్యేక వసతి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. త్వరలోనే ఆసుపత్రి నూతన భవనాలు కూడా ప్రారంభోత్సవం చేస్తామని, అన్ని రకాలుగా రోగులకు అండగా ఉండేందుకు సిబ్బందికి సూచనలు ఇచ్చామన్నారు. ఏ రోగి కూడా అనారోగ్యంతో వచ్చి ఇబ్బంది పడకూడదని, వారికి నూరు శాతం చికిత్స చేసి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా పంపించే విధంగా వైద్యులు సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యుల పనితీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరిటెండెంట్ తాతారావు, జనసేన నాయకులు వర్తనపల్లి కాశి, అడపా ప్రసాద్, పైబోయిన వెంకట్రామయ్య, యాంట్లపాటి రాజు, పాలూరి వెంకటేశ్వరరావు, మైలవరపు రాజేంద్రప్రసాద్, బయనపాలేపు ముఖేశ్ పాల్గొన్నారు.

జెఇఇ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జాతీయ సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే జెఇఇ ప్రవేశ పరీక్ష మెయిన్స్ మొదటి విడత పరీక్ష బుధవారం శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పూటలా పరీక్ష నిర్వహించారు. ఉదయం జరిగిన పరీక్షకు 219 మందికి 217 మంది, సాయంత్రం జరిగిన పరీక్షకు 221 మందికి 220 మంది పరీక్షకు హాజరు అయినట్లు కళాశాల ప్రిన్సిపల్, చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు. మెయిన్స్ పరీక్షలు ఈనెల 30 వరకు జరగనున్నట్లు ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ సంస్థ ప్రతినిధులు పరీక్షా నిర్వహణను పర్యవేక్షించారు.

పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శులు కీలకం

ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామ పంచాయతీల పూర్తి అభివృద్ధికి కార్యదర్శుల పాత్ర కీలకమని తాడేపల్లిగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.విశ్వనాథ్ శర్మ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శుల సంఘ డైరీని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు సంఘటితమైతే ఇటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలన్నారు. యూనియన్ తరపున వేసిన డైరీలో ఇటు ప్రభుత్వ విధానాలు, జిఒలతోపాటు సమగ్ర సమాచారం నిక్షిప్తం చేయడం అభినందనీయమన్నారు. ఇఒపిఆర్డి ఎం.వెంకటేష్, కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, మండల అధ్యక్షులు రావిపాటి వీరభద్రం, కార్యదర్శి బి.ఫణికుమార్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ అధ్యక్షులు బాలగోపాల శ్రీనివాస చంద్రరావు పాల్గొన్నారు.

24న బాస్కెట్‌బాల్ పురుషుల జట్టు ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలో జరగబోయే ఆంధ్రప్రదేశ్ 1వ అంతర్ జిల్లాల పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పురుషుల జట్టు ఎంపికలను ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు పిడి కర్రి కృష్ణా రెడ్డి తెలిపారు. ఈ ఎంపికలు మండలంలోని మార్టేరు ఎస్‌విఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని సెలక్షన్ కమిటీ అధ్యక్షులు తెలిపారు. ఈ ఎంపికలు ఈనెల 24వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2002 సంవత్సరం జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని, ఒరిజినల్ ఆధార్ కార్డు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ వెంట తీసుకుని రావాలని కోరారు. ఇతర వివరాలకు ప్రెసిడెంట్ కె.కృష్ణారెడ్డి(7780484313)ని సంప్రదించవచ్చని అన్నారు.

నేటి నుంచి పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని 18 రెవెన్యూ గ్రామాల్లోని ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడు రోజులు జరుగుతుందని ఎంపిడిఒ బివిఎస్‌వి.శర్మ తెలిపారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జరిగే ఈ వెరిఫికేషన్‌కు మండలంలోని 18 గ్రామాల్లో ఉన్న 91 మంది లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లోని పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్లు ముందస్తు సమాచారం ఇచ్చారు, వారు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

బసవన్న మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు అందె నాగ బసవన్న మృతి పార్టీకి తీరనిలోటు అని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆచంట వేమవరం గ్రామంలో అందె నాగ బసవన్న సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జరిగిన సంతాప సభలో చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ వైసిపి అభివృద్ధికి అనునిత్యం కృషిచేసిన ఏకైక నాయకుడు బసవన్న అని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరి కృషి, ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఇటీవల వేమవరంలో మృతిచెందిన వైసిపి నాయకుడు రుద్రాక్షాల సోమన్న కుటుంబాన్ని పరామర్శించి, వారి కుమారుడు రుద్రాక్షల సత్యనారాయణకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలలో మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి, నేతలు కొడమంచిలి రాజు, వీరభద్రం, కోట వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఎంఎంసి మాజీ ఛైర్మన్‌పై కేసు

ప్రజాశక్తి - ఉండి

అధికారులను బెదిరించిన సంఘటనలో ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజుపై బుధవారం ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉండి, పాములపర్రు రోడ్డులోని బొండాడ మురుగు కాల్వను ఆనుకుని పులిగుమ్మ ఛానల్‌కు సమీపంలో సర్వే నెంబర్ 320, 318, 319, 311, 312లలో చెరువులు తవ్వుతున్న సంఘటనకు సంబంధించి డ్రెయిన్స్ జెఇ సోమిశెట్టి జయప్రకాష్‌ను చెరువు యజమాని సాగిరాజు సాంబశివరాజు బెదిరించారు. అంతేకాకుండా బొండాడ డ్రెయిన్ గట్లను ధ్వంసం చేసి ఆక్రమించారని జయప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాంబశివరాజుపై 224, 326(బి), 351(2) సెక్షన్ల కింద ఉండి ఎస్ఐ మహమ్మద్ నసీరుల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సోమిశెట్టి జయప్రకాష్ మాట్లాడుతూ ఎఫ్‌డిఒ రాంబాబు తమకు తెలియకుండా ఎకో సెన్సిటివ్ జోన్‌లో సుమారు 13.5 ఎకరాల చెరువులకు అనధికార అనుమతులు ఇచ్చారని, కానీ సాంబశివరాజు సుమారు 23 ఎకరాల చెరువులు తవ్వుతున్నారని వివరించారు. 32 ఎకరాల వ్యవసాయ భూమికి వెళ్లే ఇన్‌లెట్ పైప్ నెంబర్ 16ను పూర్తిగా మూసివేసినట్లు సరిహద్దు రైతు దాట్ల శ్రీనివాసరాజు తమ దృష్టికి తీసుకువచ్చారని, వీటన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు.

నేటి నుంచి గో- కార్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలు

భీమవరం టౌన్ : ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయిలో 'ఎస్ఆర్‌కెఆర్ గో-కార్ట్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు బుధవారం కళాశాలలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్ బాబు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరిగే ఈ పోటీలను గురువారం ఉదయం కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. ఇప్పటికే పోటీల్లో పాల్గొనేందుకు పలు ఇంజనీరింగ్ కళాశాలల నుంచి బృందాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయని పేర్కొన్నారు. పోటీలలో విజేతలకు రూ.3 లక్షల వరకు బహుమతులు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్స్‌గా వ్యవహరిస్తున్న అధ్యాపకులు వివి.మురళీకృష్ణంరాజు, ఎన్ఎస్‌కె.వర్మ, డాక్టర్ ఐఆర్‌పి.వర్మ, యు.రాజేంద్రప్రసాద్, విద్యార్థి బృందం పాల్గొన్నారు.

కాళ్లకూరులో హుండీ లెక్కింపు

కాళ్ల : మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళ్లకూరు స్వయంభూ శ్రీవేంకటేశ్వర స్వామికి యాత్రికులు సమర్పించిన కానుకలను దేవదాయ ధర్మాదాయ శాఖ ఆకివీడు సమూహ దేవాలయాల కార్య నిర్వహణ అధికారి అల్లూరి సత్యనారాయణ రాజు సమక్షంలో బుధవారం హుండీ లెక్కించారు. హుండీ తెరిచి లెక్కించగా 97 రోజులకు రూ.21,31,807 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

యువసేన సేవలు అభినందనీయం

రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి సుభాష్

నరసాపురం : శెట్టిబలిజ యువసేన సేవలు అభినందనీయమని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. యలమంచిలి మండలం దొడ్డిపట్లకు చెందిన కడిమి కిరణ్ మణికంఠ(30) కొద్దిరోజులుగా బోన్ కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శెట్టిబలిజ యువసేన స్పందించారు. ఆ సంఘం వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.2.22 లక్షలు సేకరించారు. సేకరించిన సొమ్మును బుధవారం మండలంలోని సీతారాంపురం శెట్టిబలిజ యువసేన సంఘం రాష్ట్ర ట్రెజరర్ గుత్తుల వాసు ఇంటి వద్ద బాధితుడి భార్యకు మంత్రి సుభాష్ చేతుల మీదగా సొమ్మును అందజేశారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన గుత్తుల వాసును మంత్రి పరామర్శించారు. తన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రిని శెట్టిబలిజ సంఘం నాయకులు గజమాలతో ఘనంగా సన్మానించారు. శెట్టిబలిజ యువసేన రాష్ట్ర అధ్యక్షులు గుబ్బల రాజేష్ పాల్గొన్నారు.

పంట బోదెను పూడ్చేశారు..!



పంట బోదుకి అడ్డుకట్ట వేసిన ప్రాంతాన్ని చూపిస్తున్న రైతు

న్యాయం చేయాలని రైతు ఆవేదన

ప్రజాశక్తి - ఆచంట

తన పొలానికి నీరు రాకుండా అధికారులు అన్యాయంగా పంట బోదును యంత్రాల ద్వారా అడ్డుకట్ట వేశారని ఆచంట పెద్దపేట గ్రామానికి చెందిన రైతు బళ్ల వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకెళ్తే ఆచంట పెద్దపేట గ్రామానికి చెందిన బళ్ల వెంకటేశ్వరరావుకు ఆచంట డిగ్రీ కాలేజీకి వెళ్లే రహదారి పక్కన 75 సెంట్లు పంట భూమి ఉంది. ఆ పంట పొలానికి తూర్పు వైపు నుంచి పంట బోదే నుంచే సాగునీరు రావలసి ఉంటుంది. ఈ తరహాలో పంట పొలం బోదు దగ్గరగా ఆనుకొని పంచాయతీ రజకుల చెరువు ఉంది. గత సంవత్సరం అక్టోబర్ మూడో తేదీన పొలానికి నీరు వచ్చే పంట బోదును జెసిబితో పూడ్చేశారని వాపోయారు. ఆ బోదు నుంచి పంట పొలానికి నీరు రాకపోవడంతో తన పొలానికి నీరు రాక బీడు భూమిగా తయారైంది.

వినతి పత్రాలు అందించినా.. స్పందన లేదు

ఈ విషయంపై ఆచంట పంచాయతీ సెక్రెటరీకి అక్టోబర్ మూడో తేదీన రాతపూర్వకంగా విన్నతి పత్రం అందజేసినా కనీసం స్పందించలేదని వాపోయారు. ఇదే విషయంపై డిసెంబర్ 20వ తేదీన ఆచంటలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా వినతి పత్రం అందజేసినా కనీసం స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 20వ తేదీన సోమవారం భీమవరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు స్పందించి తన పంట చేనుకు సాగునీరు అందించేందుకు ఉన్నతాధికారులు చొరవ తీసుకుని, తనకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించుకున్నారు.

నాకు న్యాయం చేయండి


బళ్ల వెంకటేశ్వరరావు, ఆచంట పెద్దపేట రైతు



ఆచంట డిగ్రీ కళాశాలకు వెళ్లే రహదారి పక్కన నాకు 75 సెంట్లు ఊడుపు భూమి ఉంది. ఆ భూమిపైనే కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. దీనికి సంబంధించి సాగునీరు వచ్చే బోదు గత నాలుగు నెల క్రితం జెసిబితో తన పంట పొలానికి నీరు రాకుండా అడ్డుకట్ట వేశారు. తాను పంటను సాగు చేద్దామంటే నీరు లేక బంజర భూమిగా తయారైంది. ఉన్నతాధికారులు స్పందించి పంట బోదుకు వేసిన అడ్డుకట్టను తొలగించి, నాకు న్యాయం చేయాలి.

పాల ఉత్పత్తి పెంపే లక్ష్యంగా పశువైద్య శిబిరాలు

పశు వైద్యశాఖ అధికారులు



నరసాపురం : రైతులకు మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గణపవరం

రైతులకు పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డిఎం.నాయక్ అన్నారు. బుధవారం సిహెచ్.అగ్రహారంలో ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి చుక్కా అప్పారావు ప్రారంభించారు. నాయక్ మాట్లాడుతూ గేదెలకు, ఆవులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చేసి చూడు కట్టించడం, పాల ఉత్పత్తి పెంచటమే శిబిరం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. శిబిరంలో 30 పశువులకు మందులు పంపిణీ చేశారు. పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణకు మందులు అందజేశారు. లేగ దూడలకు నట్టల నివారణా మందులు అందజేశారు. మండలంలో ఈనెల 30 వరకు పశు వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.నాగ జ్యోతి పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని కొప్పర్రు గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచి నల్లి వరలక్ష్మి జేమ్స్ ప్రారంభించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పశువులకు వివిధ పరీక్షలు చేసి రైతులకి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల పశు వైద్య శాఖ అధికారి ఐ.సురేంద్ర కుమార్ మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గేదెలు, ఆవులలో గర్భకోశ వ్యాధులకి చికిత్స చేసి చూడు కట్టించడం, రైతుకి పాల ఉత్పత్తి పెంచడమే ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈనెల 31 వరకూ పశు వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. అనంతరం 33 పశువులకు మందులు పంపిణీ చేశారు. 12 గర్భకోశ వ్యాధులు పెద్ద పశువులకు, 15 లేగ దూడలకు , 25 మేకలకు నట్టల నివారణ మందు తాగించారు.

మొగల్తూరు : గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారిని గొట్టుముక్కల నీలిమ రైతులకు సూచించారు. మండలంలోని శేరేపాలెం, పేరుపాలెం నార్త్ గ్రామాల్లో బుధవారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో పశువులను పరీక్షించి మందులను రైతులకు అందించారు. పలు సూచనలు చేశారు.

తణుకు రూరల్ : నట్టల నివారణ ద్వారా పశువులు ఆరోగ్యకరంగా ఉంటాయని రేలంగి పశువైద్యశాల అధికారి పివిఎన్‌టివి.ప్రసాద్ సూచించారు. ఇరగవరం మండలం కె.ఇల్లిందరపర్రు గ్రామంలో బుధవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో పశువులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధి నివారణ కోసం, కోళ్ళ, మేకలు, గొర్రెల్లో, పాడి పశువుల్లో నట్టల వ్యాధి నివారణ కోసం మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరం ద్వారా 150 పశువులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. గ్రామ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి: ప్రతీ గ్రామంలోనూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని పెదపుల్లేరు గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఉండి మండలం పెదపుల్లేరు గ్రామంలో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో పాల్గొన్న పార్వతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశువులకు నట్టల నివారణకు, పలు రకాల వ్యాధులకు సంబంధించిన చికిత్సలు అందించడం జరుగుతున్నదని, రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ఎంపిటిసి రాయి రాములమ్మ, టిడిపి గ్రామ అధ్యక్షుడు నడింపల్లి సత్తిబాబు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశాలకు బాల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలకు రాష్ట్ర స్థాయి బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా పిల్లలకు హెల్త్ పరీక్షా విధానంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.కిరణ్మయి మాట్లాడుతూ పిల్లలకు వచ్చే 4 వ్యాధుల గురించి వివరించారు. పుట్టుకతో వచ్చే లోపాలు, వయసుకు తగ్గ శారీరక, మానసిక పెరుగుదల లేకపోవటం, అంగవైకల్యం వంటి లక్షణాల గురించి అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ పాఠశాలల్లో పిల్లలకు వైద్యపరీక్షలు చేసే సమయంలో వారి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా గమనించి పరీక్షలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు, హెచ్‌వివి.పద్మజ, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమంగా బొండు ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని అయోధ్య లంక గ్రామంలో అక్రమంగా బొండు ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. దీంతో లంక భూముల్లో యధేచ్ఛగా రాత్రి, పగలు తేడా లేకుండా బొండు ఇసుకను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల సరిహద్దు లంక భూములు నదీ గర్భంలో కలిసి పోయే ప్రమాదం ఉందని వాపోతారు. వెంటనే ఈ అక్రమ తవ్వకాలు ఆపాలని, లేకపోతే ధర్నా నిర్వహిస్తామని లంక భూమి రైతులు హెచ్చరించారు.

పూడికతీత పనులకు శంకుస్థాపన

గణపవరం : కాశిపాడు డ్రెయిన్ పూడికతీత పనులను బుధవారం ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు పిప్పరలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశిపాడు మురుగు కాలువలోకి పెంటపాడు మండలం చింతపల్లి, కోరుమిల్లి, మీనవల్లూరు, గణపవరం మండలంలో పిప్పర, కాశిపాడు, గ్రామాలకు చెందిన పోలాలలో మురికి నీరు కాశిపాడు డ్రెయిన్ ద్వారా యనమదుర్రు కాలువలోకి రావటం జరుగుతుందని చెప్పారు. డ్రెయిన్ పూడిక తీయక పోవటం వల్ల కాలువ పూడుకుపోయి పంట పొలాలలో మురికి నీరు బయటకు వెళ్లక పోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మురికి కాలువ పూడిక తీసి తమ ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాలకు చెందిన రైతుల కోరిక మేరకు పూడిక తీత పనులు ప్రారంభించినట్లు చెప్పారు. పూడిక తీత పనులు ప్రారంభించినందుకు రైతులు ధర్మరాజుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కూటమి మండల నాయకులు పాల్గొన్నారు.

భూసర్వేకు సహకరించాలి : తహశీల్దార్

ఆచంట : భూ రికార్డులు, రేషన్ కార్డుల సర్వేలకు ప్రజలు సహకరించాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలంలోని అన్ని గ్రామాల్లో హౌస్ హెూల్డ్ సర్వేతో పాటు అన్ని రకాల ఎడ్యుకేషన్, ఎలక్ట్రికల్, రెవెన్యూ, సివిల్ సప్లై రేషన్ కార్డులలో అన్ని డిపార్ట్మెంట్లకు సర్వే జరుగుతుందని, ఈ సర్వేకు ప్రతి ఒక్కరూ పాల్గొని ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. వీటిలో ఏ విధమైన సందేశాలు ఉన్నా పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించాలని కోరారు.

25న మెగా జాబ్ మేళా

పాలకొల్లు : ఈనెల 25న ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలల ఆధ్వర్యంలో ఛాంబర్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పాలకొల్లు ఛాంబర్ అధ్యక్షులు కారుమూరి నరసింహారావు చెప్పారు. ఆయన పాలకొల్లు ఛాంబర్స్ కళాశాలలో బుధవారం మీడియాతో మాట్లాడారు. గత సంవత్సరం కళాశాల స్వతంత్రంగా ఇటువంటి జాబ్ మేళా నిర్వహించి 900 ఉద్యోగాలు కల్పించిందని చెప్పారు. జాబ్ మేళాను మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆర్‌డిఒ దాసి రాజు, డిఎస్‌పి డాక్టర్ వేద ప్రారంభిస్తారని చెప్పారు. ఈ జాబ్ మేళాలో 1500 వరకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. జిల్లాలో 10వ తరగతి, ఐటిఐ, డిప్లమా, డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదివిన అభ్యర్థులు పాల్గొనాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్, జిల్లా ఉద్యోగ, ఉపాధి అధికారిని వి.వరలక్ష్మి పాల్గొంటారని చెప్పారు. పాలకొల్లు పరిసర ప్రాంత, జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొని మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల సెక్రటరీ కెవి.సీతారాం చెప్పారు. సమావేశంలో కళాశాల కోశాధికారి రేపాక ప్రవీణ్ భాను, అకాడమిక్ డైరెక్టర్ నందుల సీతారామయ్య, డిగ్రీ, ఇంటర్ కళాశాలల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, తోట వాల్గా పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

పన్నుల రూపంలో వచ్చిన ఆదాయంపై గ్రామసభలో ఆరా

నరసాపురం : గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని గ్రామస్తులు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఎల్‌బిచర్ల పంచాయతీ వద్ద గ్రామసభ నిర్వహించారు. గత ఏడాది పన్నులు శిస్తు రూపంలో వచ్చిన ఆదాయంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి లక్ష్మీపతి మాట్లాడుతూ రూ.20 లక్షల వరకు పంచాయతీ నిధులు ఉన్నాయని సభ్యులకు వివరించారు. దీంతో సభ్యులందరూ గ్రామంలో ఇంకా కొన్ని రహదారులు వేయాల్సి ఉందని, ముందుగా వాటికి ప్రాధాన్యత ఇచ్చి రహదారులను నిర్మించాలని తీర్మానించారు. ఈ తీర్మానాన్ని పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి పనులు జరిగేలా చూడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో బొడ్డు ఆశిష్ కుమార్, కటకంశెట్టి సంజీవరావు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ఆచంట : ఈనెల 25వ తేదీన జరుగునున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తహశీల్దార్ జి.కనకరాజు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఒల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సన్మానించి సత్కరిస్తామని తెలిపారు. అనంతరం జగనన్న కార్యక్రమంలో ముగ్గుల పోటీలతో పాటు వేద సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సోమేశ్వరరావు, కిషోర్, ఆర్ఐ జై.లలిత పాల్గొన్నారు.

కోడేరు రీసర్వే ప్రాజెక్టుగా ఎంపిక

ఆచంట : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మండలంలోని కోడేరు గ్రామాన్ని రీ సర్వే ప్రాజెక్టుగా ఎన్నుకోవడం జరిగిందని తహశీల్దార్ జి.కనకరాజు సోమవారం విలేకరులకు తెలిపారు. కోడేరు గ్రామంలో రైతులు, వ్యవసాయ భూమి ఉన్న రైతులు, వారికి సంబంధించిన రైతుల భూముల రికార్డులతో ఈ సర్వే కార్యక్రమంలో పాల్గొని రీ సర్వే టీంకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

డేవిడ్ రాజు మృతి తీరని లోటు

నరసాపురం : విఆర్ఒ డేవిడ్‌రాజు మృతి రెవెన్యూ శాఖకు తీరని లోటని నరసాపురం డిప్యూటీ తహశీల్దార్ ఎన్ఎస్ఎస్‌వి.ప్రసాద్ అన్నారు. బుధవారం సాయంత్రం మండల రెవెన్యూశాఖ కార్యాలయం వద్ద తూర్పుతాళ్లు విఆర్ఒ పల్లికొండ డేవిడ్ రాజు మృతికి సంతాపం తెలిపారు. తొలుతగా డేవిడ్ రాజు చిత్రపటానికి డీటీ ప్రసాద్, ఆర్ఐ మిరియాల లక్ష్మీనారాయణ, నరసాపురం సబ్ డివిజన్ విఆర్ఒ అధ్యక్షుడు కె.సత్తిబాబు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రెవెన్యూ శాఖకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు జయరామ్, బాలాజీ, భవాని పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని విఆర్ఒ పల్లికొండ డేవిడ్ రాజు మృతదేహాన్ని బొమ్మిడి నాయకర్ బుధవారం సందర్శించారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపారు. ఆయన వెంట కూటమి నాయకులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధ పట్టణంగా తీర్చిదిద్దాలి

మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి

భీమవరం టౌన్ : 100 శాతం ప్లాస్టిక్ నిషేధ పట్టణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వారి ఆదేశాలను అనుసరించి భీమవరం పురపాలక సంఘం పరిధిలో 100 శాతం ప్లాస్టిక్ నిషేధం అమలుకై బుధవారం సాయంత్రం కమిషనర్ వారి ఆధ్వర్యంలో ఆయన మీటింగ్ హాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు, శానిటేషన్ సెక్రటరీలకు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పురపాలక సంఘం కమిషనర్ వారు మాట్లాడుతూ పట్టణంలో అన్ని రకాల ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులపై పూర్తిస్థాయి నిషేధం ఉన్న కారణంగా విక్రయదారులు సదరు నిషేధిత వస్తువుల క్రయవిక్రయాలు జరపరాదని, నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో పర్యావరణహిత ప్రత్యామ్నాయ వస్తువులను ఉపయోగించాలన్నారు. వాటి అమ్మకాలు మాత్రమే జరపాలని, లేనిచో పెద్ద మొత్తంలో పెనాల్టీలు విధించాలన్నారు. మావుళ్లమ్మ అమ్మవారి ఉత్సవాలలో ఆహార పదార్థాల క్రయవిక్రయాలు జరుగుతున్న వారు అన్ని రకాల ఆహార భద్రత ప్రమాణాలు పాటించాలని, వారి షాపుల యందు చెత్త బుట్టలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు.

వార్డుల్లో డ్రెయినేజీల పరిశీలన

నరసాపురం : పట్టణంలోని పలు వార్డుల పరిధిలో ప్రధాన డ్రెయినేజీలను బుధవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా ప్రతి రోజు డ్రెయినేజీ శుభ్రం చేసే పనులను చేపట్టామని చెప్పారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. డ్రెయినేజీలలో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ నేత పాలక్ వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌ని అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జి పాలక్ వర్మ డిమాండ్ చేశారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా భీమవరం నియోజవర్గ ఇన్‌ఛార్జి అంకెం సీతారాం ఆధ్వర్యంలో బుధవారం అమిత్ షా వ్యాఖ్యలపై ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా జిల్లా కార్యాలయంలో ఉన్న గాంధీ, రాజీవ్ గాంధీ విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన అంబేద్కర్‌పై అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పత్తిపాటి హరికుమార్ రాజు, జిల్లా నాయకులు సాగర్, దుండి రవికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాట క్లబ్ మూసివేయాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

తమ గ్రామంలో కల్చరల్ యూత్ క్లబ్ పేరుతో నిర్వహిస్తున్న పేకాట క్లబ్ మూసి చేయాలని బుధవారం గ్రామస్తులు కలిసి గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తొలుతగా గ్రామంలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద కులమతాలకు అతీతంగా సమావేశం నిర్వహించారు. అనంతరం సీతారామపురం సౌత్ పంచాయతీ కార్యదర్శి మండెల యుగంధర్ శ్రీనివాస్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ మండలంలోని సీతారామపురం సౌత్ గ్రామంలో జాతీయ రహదారిని ఆనుకుని పెట్రోల్ బంక్ పక్కన కల్చరల్ యూత్ క్లబ్ పేరుతో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారు. దీనివల్ల గ్రామంలోని యువతతో పాటు, చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక కుటుంబాలు పేకాటకు బానిసై ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు గ్రామంలో నిర్వహించడం వల్ల గ్రామంలోని యువతీయువకులు, ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పేకాట క్లబ్‌ను మూసివేసి, భవిష్యత్తులో ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించకుండా, సదరు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొండేటి త్రినాథులు, దొండపాటి వెంకట్, అడబాల అయ్యప్ప నాయుడు పాల్గొన్నారు.